ఓం 2018

## భావి తరాలకు బాటలు వేసిన చైతన్యానికి సుప్రభాతం

అమ్మగారిని నేను నా ఏనిమిదవ ఏట మొదటిసారిగా చూశాను. అదిగో అల్లదిగో అని ఆవిడ పాడిన అన్నమాచార్య కీర్తన నా పసి మనసులో చెరగని ముద్రవేసింది. ఆనాటి నుండి ఈనాటి వరకు అన్నమయ్య పాటకు మారుపేరుగా నిలిచారు అమ్మ.

కరుణారసాన్ని వర్షించే దృష్టి, అరమరికలు లేకుండా అందరినీ అక్కున చేర్చుకునే వాత్సల్యం, నమ్రభావం, ఆర్ద్రత నిండిన హృదయం, నిరాడంబరత, ఆవిడ సహజ స్వభావం.

భగవంతుణ్ణి చేరడానికి శుద్ధభక్తి మార్గమైతే ఆ భగవంతుడికి అతి దగ్గరగా ఉన్న భాగవతోత్తముల్ని ప్రత్యక్షంగా దర్శించుకుని ఆ అమృత ధారలో తడిసి తరించే అవకాశం అమూల్యం.

అమ్మంటే పరిమళాల పారిజాతం, సుస్వరాల సంగీతం. తన గాత్రంతో ఏమొకో చిగురుటధరమున అని శృంగార రసావిష్కరణ చేసినా, చాలదా హరినామ సౌఖ్యామృతము తమకు అని ముక్తి మార్గం చూపినా, సిరుత నవ్వులవాడే సిన్నెక్కా అని జానపదుల బాణీలో కూర్చిన గోవింద అవతార మహిమను చాటినా, శ్రీనందకాయ విద్మహే శ్రీశదాసాయ ధీమహి అని చిన్నారులకు మంత్రోపదేశం చేసినా అన్నమయ్య పాటలోని భక్తరసామృతాన్ని లోకానికి పంచిపెట్టే పాత్రను మాత్రమే అనే అహంకార రాహిత్యం ఆవిడకే చెల్లింది.

ఏ దేశమేగినా, ఎందుకాలిడినా ఏ పీఠమెక్కినా, ఎవ్వరెదురైనా పొగడరా నీ తల్లి భూమి భారతిని నిలుపరా నీ జాతి నిండు గౌరవము అన్న రాయప్రోలు గారి మాటలను అక్షరసత్యంగా మలచిన అమ్మగారి జీవితం మా అందరికీ గొప్ప ఆదర్శం.

అమ్మగారి గాత్రం నుండి వెలువడిన పదమైనా, పాటైనా నేరుగా మనసు తలుపు తడుతుంది.

ఆవిడ సాన్నిధ్యంలో కలిగిన అవ్యక్తానుభూతికి, ఆనందాతీత స్థితికి నా కంటి వెంట ధారగా కారిన అశ్రుధారలే నిదర్శనం. నాలో ఎగసిన ఈ భావతరంగాలు అమ్మ పై నాకు గల అభిమానానికి ఒక మచ్చుతునక మాత్రమే. ఆవిడ వ్యక్తిత్వాన్ని పూర్ణత్వంలో చూడగలిగే సంస్కార బలాన్ని నాకు ప్రసాదించమని ఆ అనంతుణ్ణి భక్తి శ్రద్ధలతో ప్రార్థిస్తున్నాను.

అమ్మగారి హృదయంలో రగిలిన చిదాగ్ని దావానలంలా వ్యాపించి తన యోగాగ్నితో మరెంతో మంది హృదయాల్ని చేరి పవిత్రుల్ని చేయడం ఆవిడ సంకల్పశుద్ధికి నిదర్శనం.

అమ్మకు నా వినయపూర్వక పాదాభివందనములు.
ఆవిలో ఉన్న గురుమూర్తికి నా నమస్సుమాంజలులు.